# ప్రేమలేఖలు

— డా॥ మంతెన సూర్యనారాయణరాజు

"సుబ్రహ్మణ్యం ! సుబ్రహ్మణ్యం !" అంటూ సూపర్నెంటు పిలిచాడు. అప్పటి దాకా అయిదు సంవత్సరాల నుండి అంతు చిక్కని పెండింగ్ ఫైల్ ఒక దానిని అదే పనిగా చూస్తున్నాడు మణ్యం. బాగా స్టడీ చేసి ఫుట్‌నోట్ డ్రాఫ్టింగ్ వ్రాస్తున్నాడు. ఎందుకు కేకవేశాడోనని సూపరెంట్ దగ్గరికెళ్ళి "ఎందుకు సార్ పిలిచారు?" అన్నాడు వినయం ఉట్టిపడేలా.

"అవునయ్యా ! నీకు ఎన్నిసార్లు చెప్పాను. వచ్చిన ఫైలు వచ్చినట్లుగా ఫార్వర్డ్ చేస్తూ నా దగ్గరకు వెంటనే పంపొద్దని. చూడు. ఎన్ని ఇక్కడ చోటులేక అఘోరిస్తున్నాయో ! అక్కడికి ఆఫీసులో నువ్వొక్కడివే సిన్సియర్‌గా అఘోరిస్తున్నట్లు మేం సరదాకి జీతం తీసుకుంటున్నట్టూనా ! వెళ్ళు. ఇంకోసారి ఇలా జరిగితే ఏదో వంక పెట్టి నీ మీద వ్రాసి పారెయ్యగలను" అన్నాడు —ఇంక వెళ్ళుమన్నట్టు ముఖం పెట్టూ మసేన్‌రావు.


తిరిగి వచ్చి సీట్లో కూలబడుతూ సుబ్రహ్మణ్యం అదే పనిగా ఆలోచించసాగాడు. ఈ సూపర్నెంట్ గాడికి నేనే పని చేసినా ఏదో ఒకటి వంక పెట్టి తిడితే కానీ తృప్తి ఉండదు. పార్టీల దగ్గర పెద్ద ఎత్తున డబ్బు మింగేసి కొలీగ్స్, అసిస్టెంట్లకి కనీసం ఫైవ్ పర్సెంటైనా వాటా పెట్టకుండా సొంతం గుటుక్కు మనిపిస్తాడు. ఏం జేస్తాం. ఇదో శాడిజం అనుకున్నాడు. ప్రక్క సీట్లో వాడి బావమరిది కోసం అటువైపు చూశాడు. అతగాడు సీట్లో లేడు.

ఎవరో వ్యక్తి అక్కడికొస్తూ సుబ్రహ్మణ్యం కనిపిస్తే "సార్ ! మీ ప్రక్క సీట్లో గోవిందు గారు. అదేనండీ మీ సూపర్నెంట్ బామ్మర్ది గారు... లేరాండీ" అంటూ నసుగుతూ అడిగాడు. "కనపడ్డంలే ! మళ్ళీ అడగాల ! ఇంత కన్నా వివరాలు కావలిస్తే వాళ్ళ బావగారు అదిగో... ! ఆ కేబిన్ రూమ్‌లో ఉన్నారు వెళ్ళి అడగండి" అన్నాడు.

"మీరు భలే వారండీ... వెళ్ళి వెళ్ళి సూపర్నెంట్ గారినే కలవమంటున్నారా ! కరిచేస్తాడు. లేదా ఓ తట్ట వరస తిట్లు తిడ్తాడు. వస్తానండీ. ఆయనొచ్చాకా వస్తాలెండి" అంటూ ఆ వ్యక్తి వెళ్ళి పోయాడు.

అయిదు గంటలకల్లా వర్క్ ముగించుకుని ఆఫీసు నుండి బైటపడ్డ సుబ్రహ్మణ్యానికి సి—2 సెక్షన్‌లో క్లర్కు వనకుశాలరావు కనిపించాడు. సుబ్రహ్మణ్యాన్ని విష్ చేస్తూ "గురూ ! ఈ నెలతో మీ రుక్మాంగదరావు రిటైర్ అవుతాడట కదా. నెక్స్ట్ సీనియర్‌వి నువ్వే కదా ! ప్రమోషన్ రాగానే పార్టీ ఇవ్వాలి సుమా !" అన్నాడు.

"ఆ ! ఆ ! అదొక్కటే




తక్కువ నా బ్రతుకులో మసేన్ రావు నా మీద కక్షతో తన బావమరిది గోవిందాన్ని ఏదో రకంగా యూడీసీ చేసేద్దామని నానా తంటాలు పడుతుంటే నా కంతటి అదృష్టం కూడానా ! పనులన్నీ నా చేత చేయిస్తున్నాడు. పెత్తనాలు, పైనొల్లుడూ ఆ గోవిందం గాడి వంతు. చెప్పుకుంటే సిగ్గు. గవర్నమెంట్ ఆఫీసైనా ఈ దేశంలో కూడా మార్షల్ లా రావాలోయ్" అన్నాడు బాధగా.

"రా ! అలా కాస్త ఛాయ్ కొట్టి వెళుతూ వెళుతూ విషయం మాట్లాడుకుందాం!" అంటూ వనకుశాలరావు సుబ్రహ్మణ్యాన్ని హోటల్‌వైపు లాక్కుపోయాడు.

ఇద్దరూ ఛాయ్ తాగి బైటపడ్డారు. అనుకోకుండా ఎదురుగా గోవిందం, మసేన్‌రావు మోటార్ సైకిల్ మీద ఇంటికి వెళుతూ దర్శనమిచ్చారు. వనకుశాలరావు వాళ్ళని గమనిస్తూ "అబ్బా ! ఇద్దరూ కృష్ణార్జునులేనయ్యా ? మీ బాస్‌ది నల్ల కోతి ముఖం. వీడిదేమో పండుకోతి ముఖం. వెధవ జంట జీడీకి నువ్వులు అతుక్కున్నట్లు అతుక్కుపోతారు ముండావాళ్ళిద్దరూ !" అన్నాడు. పగలబడి నవ్వుకున్నారిద్దరూ.

★ ★ ★

ఆదివారం ఆట విడుపు కోసమని సుబ్రహ్మణ్యం భార్యతో పాటు మేట్నీ చూసి వస్తున్నాడు. ఎదురుగా మసేన్ రావు అతని భార్య వసంతతో ఫస్ట్ షోకిగావును వచ్చినట్లున్నాడు. చూసి పలకరించకపోతే బాగుండదనుకుని "హలో సార్ ! సిన్మాకొచ్చారా ?" అంటూ విష్ చేశాడు. మసేన్ రావు ముఖం చిట్లించి "తెలియడంలే సిన్మాకొచ్చినట్టు —మళ్ళీ సిన్మాకొచ్చారా... అంటూ అడగాలేమిటి ?" అంటూ సుబ్రహ్మణ్యం భార్యలక్ష్మిని చూసి ఒక్క క్షణం ఆగిపోయాడు.

లక్ష్మి కూడా అతగాణ్ణి చూసి ఆగిపోయింది. "ఎక్కడా ... ? ఎప్పుడూ... ?" అంటూ ఆలోచనల్లో పడిపోయింది. మసేన్ పెట్టిన చీవాట్లతో సుబ్రహ్మణ్యం అక్కడ ఉండలేక "రా... లక్ష్మీ... ! వర్షం వచ్చేలా ఉంది" అంటూ పిలిచాడు. ఆమె అతనిని అనుసరించింది. నెమ్మదిగా నడుస్తూ "ఎవరండీ ఆయన. మీ మీద అంత అజమాయిషీ చెలాయిస్తూంటే చూస్తూ ఊరుకుంటారు. నాలుగు జాడించక" అంది. "నెమ్మది. నెమ్మది. అట్టే గట్టిగా మాట్లాడితే రేపు నీ మొగుడి చేత అడ్డమైన అరవ చాకిరీ చేయించేస్తాడు. ఆఫీసులో..."

"ఎందుకు?"

"అబ్బబ్బా... రా...? ముందు రిక్షా ఎక్కు... దార్లో వెళుతూ మాట్లాడుకుందాం" అంటూ రిక్షాలో ముందు తాను ఎక్కి కూర్చున్నాడు. ఆమె మసేన్ రావు వైపే చూస్తూ రిక్షా ఎక్కి భర్త ప్రక్కన కూర్చుంది. గతం వైపు ఆమె మనస్సు పరుగులు తీసింది. సుబ్రహ్మణ్యం స్వేచ్ఛగా ఊపిరి పీలుస్తూ "వీడి ముఖం తగలెట్ట ! ఆఫీసులో నా కన్నా సుపీరియర్ కాబట్టి తన హోదా చూపిస్తాడు. సరే.... సీనియర్ కదా అని సరిపెట్టుకుంటూ ! ఏదో ఫార్మాలిటీకని" సినిమా కొచ్చారా" అని పలకరిస్తే ఇక్కడ చూశావా ? ఏం తెలియడంలే అంటూ ఇక్కడా అజమాయిషీయేనా —అయినా ఎన్ని పాపాలు చేసి ఈ గుమాస్తా జన్మ ఎత్తానో నేను" అన్నాడు డీలాపడిపోతున్నట్లుగా.

భార్య లక్ష్మి పరధ్యాన్నంగా మసేన్ వైపే

చూస్తోంది. అది గమనించిన సుబ్రహ్మణ్యం "నిన్నే ! ఈ లోకంలో ఉన్నావా ?" అంటూ పలకరించాడు. లక్ష్మి గతంలోంచి ప్రస్తుతంలోకి వస్తూ "ఆ... ! ఉన్నాను. ఇంతకీ ఎవరంటారాయన ?" అడిగింది భర్తను.

"ఎవరా ? నీకు నేను మొగుణ్ణి ! నాకాయన ఆఫీసులో మొగుడు. ఇది మా మధ్య రిలేషన్ అర్థమయ్యిందా ?"

"ఓహో ! అదా ! విడిసిపాటు ! అర్థమయిందిలెండి. రోజూ ఆఫీసులో అయన తిట్టిన తిట్లన్నీ జాగ్రత్తగా మోసుకొచ్చి పిల్లమీదా, నా మీదా కురిపిస్తూ ఆపసోపాలు పడిపోతుంటారు ఆయనేనా ఈయన ?" అంటూ దీర్ఘం తీసింది.

"అబ్బా ! ఎగ్జాక్ట్లీ ! అమోఘమైన తెలివితేటలే నీవి లక్ష్మీ ! వెధవది నా భార్యవైపోయావు. లేకపోతే నీకున్న తెలివితేటలకు ఓ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాదగినదానవే !" అన్నాడు మణ్యం.

"చాల్లెద్దురూ ! మీరు మరీనూ. ఈయనేనా మీకు ప్రమోషన్ రాకుండా తన బావమరిదికి అది ఇప్పించాలని సైంధవుడిలా అడ్డు పుల్ల వేస్తున్నదీ" అంది.

"ఔనే ! వాడేనే పాపాత్ముడు... దుర్మార్గుడు.... నీచుడు... నికృష్టుడు."

"ఆ తిట్లు ఆపి నేనడిగిందానికి జవాబు చెప్పండి. మీరు ముందు జాయిన్ అయ్యారా ? లేక అతను ముందు జాయిన్ అయ్యాడా ?" అని సాలోచనగా అడిగింది లక్ష్మి భర్తను.

"ఇద్దరం ఒక్కసారే !"

"అయితే రిజిస్టర్‌లోనూ ! అప్పాయింట్‌మెంట్ ఆర్డర్‌లోనూ ఎవరి పేరు ముందుంది. మీ కన్నా ఆయన గారికేమైనా ఎడిషనల్ క్వాలిఫికేషన్స్ ఉన్నాయా ! ఉంటే చెప్పండి."

"ఆ రెండింటిలోనూ నా పేరే పైనుంది వాడికేవిధమైన క్వాలిఫికేషన్స్ నా కన్నా ఎక్కువగా లేవు. ఇవన్నీ ఎందుకడుగుతున్నట్టు" అని అమాయకంగా భార్య వైపు చూస్తూ అడిగాడు.

"అలాగైతే మీ రింక నిశ్చింతగా ఉండండి. మీకొచ్చే ప్రమోషన్ ఎలా రాదో అదీ చూస్తాను. వేషాలేస్తున్నాడే... వెధవ" అంటూ వీర పత్నిలా ఫోజుపెట్టింది లక్ష్మి.

"కొంపదీసి వాడింటికి వెళ్ళి ఏ అప్పడాల కర్రతోనే కొట్టిగాని చంపేస్తావేవిటే ? వద్దే ! అటువంటి పరువు తక్కువ పని మాత్రం చెయ్యకే ! నా బాధలేవో నే పడతానులే ! పెళ్ళాన్నడ్డం పెట్టుకుని ప్రమోషన్ కొట్టాడని మాత్రం చస్తే అనిపించుకోను" అన్నాడు భార్య లక్ష్మితో సుబ్రహ్మణ్యం.

"మీరు అలా చూస్తూ ఉండండి. మీకు ప్రమోషన్ వచ్చేస్తుంది. ప్రమోషన్ వస్తే నాకేం ప్రజెంటేషన్ ఇస్తారు" అంది భర్త షర్టు బటన్స్ సరిదిద్దుతూ.

"ఓ మూడు వందలిచ్చుకుంటాను. అది కూడా రెండు దఫాలుగా".

"ముష్టి మూడొందలు. దానికి రెండు ఇన్‌స్టాల్‌మెంట్స్ ! మీ గుమాస్తా బుద్ధి పోనిచ్చుకున్నారు గాదు మొత్తానికి" అంది.

"అయినా నాకు తెలియక అడుగుతాను ఏం చేయదల్చుకున్నావేమిటే ?"


"ఏదో చేస్తాను. వేచి చూడండంతే ?" అంది లక్ష్మి. ఇల్లు దగ్గర పడగానే రిక్షా ఆపమన్నాడు. ఇద్దరూ రిక్షా దిగారు. లక్ష్మి ఇంట్లో కెళ్ళాకా రిక్షా వాడికి డబ్బులిచ్చి పంపేశాడు. సుబ్రహ్మణ్యం. పిల్లలిద్దరూ సుబ్రహ్మణ్యాన్ని నాన్నా మాకేం తెచ్చావు అంటూ చుట్టుముట్టారు. ఇద్దరికీ తాను కొని తెచ్చిన చాక్లెట్లు ఇచ్చాడు.

★ ★ ★

"నాన్న గారూ మీ కోసం ఎవరో వచ్చారు ?" అంటూ మహేష్ రావు కొడుకు తండ్రిని పిలిచాడు. అక్కడికి వస్తూనే మహేష్‌రావు "ఎవరూ !" అంటూ లక్ష్మిని చూడగానే షో కేసు బొమ్మలా బిగుసుకుపోయాడు. మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ పైకి "ముందు కుర్చీ లక్ష్మీ! ఉరేయ్ ! రెండు కాఫీలు పంపమని చెప్పు అమ్మతో ! " అంటూ కొడుక్కి చెప్పాడు. అతను చూపించిన కుర్చీలో లక్ష్మి ఠీవిగా కూర్చుంది. మహేష్ సోఫాలో కూర్చున్నాడన్న మాటేగానీ ముళ్ళమీద కూర్చున్నట్లుగా ఉంది ముఖకవళికల్ని బట్టి చూస్తే. లక్ష్మి రెండు ఫోటోస్టాట్ ఉత్తరాలు హేండ్ బ్యాగ్‌లోంచి తీసి ఇవి చూడు అన్నట్టు అతని ముందుకు విసిరింది.

వాటిని తీసి చదివిన వెంటనే మహేష్ రావు గుండె వేగంగా కొట్టుకోసాగింది. లేచి అనీజీగా నిలబడి ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ ఫేన్ వేశాడు. చెయ్యి వణుకుతోంది. ఉత్తరాలు చేతిలోకి తీసుకున్నాడు. ఆమెతో "లక్ష్మి అర్థమయ్యింది విషయం. ఈ ఉత్తరాలు తీసుకెళ్ళి పో ! నీ భర్తకు ప్రమోషన్ ఇప్పించే పూచీ నాది. బిలీవ్ మీ. వీటిని నేను నీకు వ్రాసానన్న సంగతి తెలిస్తే మాయింటావిడ ఇల్లు పీకి పందిరేస్తుంది. అంతే కాదు. మనం క్లాస్‌మేట్స్ అని తెలిసినా నేను నీకివి రాశానని తెలిసినా నా బ్రతుకు నలుగుర్లో నవ్వులపాలౌతుంది. కీపిట్ ఆఫ్" అన్నాడు పని పిల్ల రెండు కాఫీలు తీసుకొచ్చి ఇద్దరికీ ఇచ్చింది. ఆమె ఖాళీ కప్పు టీపాయ్‌మీద పెట్టి వెయిటర్స్ తన బ్యాగ్‌లో పెట్టుకుని "థ్యాంక్స్" అని తన దారితాను వెళ్ళిపోయింది.

## గోపాల్ కె.వి. శాస్త్రికి అవార్డు



ఆంధ్ర సారస్వత పరిషత్ అనగానే హైదరాబాద్‌లోని బొగ్గులకుంటలో ఉన్న పరిషత్‌హాలు జ్ఞాపకమొస్తుంది. అయితే ఇదే పేరుతో ఉన్న సంస్థ ప్రవాసాంధ్రలో తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగానికి ఎనలేని సేవలు అందిస్తున్నది. ముంబాయిలో ఈ సంస్థ ఇటీవలనే స్వర్ణోత్సవాలను జరుపుకుంది.

ఈ సంస్థ పాఠ్యగ్రంథాల ప్రచురణను సైతం చేపట్టడం విశేషం. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ మద్దతు కూడాఉంది. సాంఘిక, సంక్షేమ కార్యక్రమాలకు లాభాపేక్ష లేకుండా ఈ సంస్థ విస్తృతంగా కృషి చేస్తోంది. ఈ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గోపాల్ కె.వి.శాస్త్రి అందించిన సేవలకు గాను "లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు"ను తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.గోపి చేతుల మీదుగా (ముంబాయిలో) అందుకున్నారు.